నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 5 నవంబర్ 2024 | NIZAMABAD


వేల్పూర్ పోలీసుస్టేషన్‌లో మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్రమ అరెస్టులు
- ఇంటి నుంచి బయటికి రాకుండా నిర్బంధాలు
- చలో హైదరాబాద్‌కు వెళ్తారని ఎక్కడికక్కడ అడ్డంకులు
- బిల్లులు చెల్లించాలంటున్న మాజీ సర్పంచులు
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు

# ఇదేనా ప్రజాపాలన?

**మాజీ సర్పంచులపై నిర్బంధ కాండ**

**ప్రజాపాలన పేరు చెప్పి** గద్దెనెక్కిన కాంగ్రెస్.. పోలీసు పాలనకు తెర లేపింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ఉక్కుపాదంతో అణచివేస్తున్నది. ఎక్కడికక్కడ నిర్బంధ కాండ కొనసాగిస్తున్నది. ఇప్పటికే అనేక నిరసనలను ఖాకీలతో కట్టడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా మాజీ సర్పంచులు చేపట్టాలనుకున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని అక్రమ అరెస్టులతో కట్టడి చేసింది. పెండింగ్ బిల్లుల కోసం శాంతియుత నిరసన చేపట్టాలనుకున్న వారిని సోమవారం తెలవారక ముందే దిగ్బంధించింది. బహిర్భూమికి వెళ్లనీయకుండా, మార్నింగ్ వాకింగ్ చేస్తుంటే అడ్డు తగిలి మరీ అదుపులోకి తీసుకున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్‌కు చెందిన వారిని మాత్రమే అరెస్టు చేయడం గమనార్హం.చాలా మందిని పోలీస్ స్టేషన్‌లకు తరలించగా, మరికొంత మందిని గృహ నిర్బంధంలో ఉంచారు.

–నిజామాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**మాజీ సర్పంచు ఒకరు** సోమవారం పొద్దున్నే వాకింగ్‌కు వెళ్లగా, పోలీసులు వచ్చి జీపులో వేసుకెళ్లారు. ఇదేమని ప్రశ్నిస్తే.. 'చలో హైదరాబాద్'కు వెళ్లేందుకు అనుమతి లేదని చెప్పారు. అరె నేను హైదరాబాద్ కాదు.. వాకింగ్‌కు వెళ్తున్నా అని చెప్పినా వినకుండా ఠాణాకు తీసుకెళ్లి మధ్యాహ్నం దాకా కూర్చోబెట్టారు.

**మరో మాజీ సర్పంచు** తెలవారుతుండగా టార్చ్‌లైట్ పట్టుకుని పొలానికి వెళ్లాడు. అక్కడకు వెళ్లిన పోలీసులు.. లుంగీ మీద ఉన్న అతడ్ని నిర్బంధించి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. ఏదో నేరం చేసినట్లు పొద్దుగాళ్లనే వచ్చి లుంగీ మీద ఉన్న నన్ను గిట్ల ఎత్తుకొచ్చుడేంది సారు అని ప్రశ్నించినా పట్టించుకోకుండా ఠాణాలో ఉంచారు.

**మరో గ్రామంలో** ఓ మాజీ సర్పంచు నిద్ర కూడా లేవలేదు. అతడ్ని బలవంతంగా నిద్రలోంచి లేపి మరీ పోలీసు జీపులో తీసుకెళ్లారు. దీంతో ఆయన ఏదో నేరం చేసినట్లు గ్రామంలో ప్రచారం జరిగింది. మధ్యాహ్నం తర్వాత అక్రమంగా నిర్బంధించారన్న నిజం అని తెలిసి గ్రామస్తులు పోలీసుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గతంలో** గ్రామ పంచాయతీల్లో సొంతంగా నిధులు వెచ్చించి చేసిన పనులకు సంబంధించిన బిల్లులను మంజూరు చేయాలని మాజీ సర్పంచులు కోరుతున్నా రేవంత్ సర్కారు పట్టించుకోలేదు. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో నిరసన చేపట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా సోమవారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. భయాందోళనకు గురైన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజాస్వామ్యయుతంగా చేపట్టాలనుకున్న కార్యక్రమాన్ని ఖాకీలతో అణచివేసింది. డీజీపీ ఆదేశాలతో పోలీసులంతా ఎక్కడికక్కడ మాజీ సర్పంచ్‌లను తెలవారుజామున 4 గంటల నుంచే అదుపులోకి తీసుకున్నారు. చివరకు నిద్రలో ఉన్న వారిని లేపి మరీ ఠాణాలకు తరలించారు. మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వారిని, పొలానికి వెళ్లిన వారిని లుంగీలు, నైట్‌ప్యాంట్‌లు మీద ఉన్నారని కూడా చూడకుండా అక్రమంగా నిర్బంధించారు. సొంత డబ్బులు పెట్టి పనులు చేయించి బిల్లులు అడిగితే, పోలీసులను ఉసిగొల్పడంపై మాజీ సర్పంచులు మండిపడ్డారు.

### ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?

ప్రజాపాలన అని ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ సర్పంచుల కుటుంబాలు తీవ్ర స్థాయిలో దుమ్మెత్తి పోస్తున్నాయి. ప్రజల ఓట్లతో గెలిచి సర్పంచుగా ఐదేళ్లు పని చేసిన వ్యక్తులకు సర్కారు ఇచ్చే గౌరవం ఇదేనా? అంటూ ప్రశ్నిస్తున్నాయి. రౌడీ మూకలను, సంఘ విద్రోహులను ఎత్తుకెళ్లినట్లు తమ వారిని ఎత్తుకెళ్లడంపై మాజీ ప్రజాప్రతినిధుల కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇదేనా ప్రజాపాలన.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని మండిపడ్డారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరూ నిరసన తెలిపే హక్కు ఉందని, ఆ హక్కును కాంగ్రెస్ సర్కారు కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన రీతిలో గుణపాఠం ఖాయమని హెచ్చరిస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి చేసిన పనులకు బిల్లులు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వమే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వంటి బడా కాంట్రాక్టర్లకు మాత్రం క్షణాల్లో రూ.వేల కోట్లు చెల్లింపులు చేస్తున్నదని, సామాన్యులపై మాత్రం కాంగ్రెస్ సర్కారు ప్రతాపం చూపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బిల్లులు చెల్లించకుంటే బీఆర్ఎస్ పోరుబాట

**మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**



మోర్తాడ్, నవంబర్ 4: అప్పులు తెచ్చి గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు అడిగితే అరెస్టు చేయిస్తారా? అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజాపాలన పేరుమీద ఢాంబికాలకు పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లవారుజాము నుంచే మాజీ సర్పంచులను, మాజీ ఉపసర్పంచులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, లేకపోత బీఆర్ఎస్ తరఫున పోరుబాట చేపడతామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డికి మాజీ సర్పంచులంటే ఎందుకంత కోపమని ప్రశ్నించారు. పొంగులేటి, కోమటిరెడ్డి వంటి బడా కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు డబ్బులుంటాయి కానీ, చిన్న చిన్న కాంట్రాక్టర్లకు, మాజీ సర్పంచులు ఇచ్చేందుకు మాత్రం డబ్బులుండవా? అని నిలదీశారు. 'రూ.లక్షన్నర బిల్లు కోసం పది నెలల నుంచి తిరుగుతున్నా రావడం లేదని ఓ సర్పంచ్ నాతో మొర పెట్టుకున్నాడు. లక్షన్నర బిల్లు చెల్లించేందుకు ప్రభుత్వం దగ్గర డబ్బులేదు కానీ, లక్షన్నర కోట్లతో మూసి ప్రాజెక్ట్ పనులు చేస్తరట?' అని వేముల ఎద్దేవా చేశారు. తక్షణమే బిల్లులు చెల్లించాలని, లేకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు.

### బిల్లులు అడిగితే అరెస్టులా?



ఆర్మూర్ టౌన్, నవంబర్ 4: అప్పులు తెచ్చి పనులు చేసిన సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. బిల్లులు అడిగితే అక్రమంగా అరెస్టు చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. చలో హైదరాబాద్‌కు వెళ్లకుండా మాజీ సర్పంచులను తెలవారక ముందే నిర్బంధించడాన్ని ఆయన ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. చేసిన పనులకు డబ్బులు ఇవ్వమంటే ఇవ్వకుండా ఇలా అరెస్టు చేయడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపులు జరిగాయని, కేంద్ర నిధులతో పాటు రాష్ట్ర నిధులు సరిసమానంగా విడుదల చేశామన్నారు. రేవంత్ ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని డిమాండ్


డిచ్‌పల్లి ఠాణాలో మాజీ ప్రజాప్రతినిధుల నిర్బంధం



ఇందల్వాయి పోలీసుస్టేషన్‌లో..

### కార్తీక శోభ






కార్తీక మాసం.. తొలి సోమవారం.. ఉమ్మడి జిల్లాలోని దేవాలయాలు తెలవారుజాము నుంచే దేదీప్యమానంగా వెలిగి పోయాయి. కార్తీక దీపాల వెలుగుల్లో కొత్త కాంతులు విరజిమ్మాయి. మహిళలు తులసి, ఉసిరిక పూజలు చేసి దీపాలు వెలిగించారు.

– సుభాష్‌నగర్, నవంబర్ 4

- సెలవు కావాలన్నా చేయి తడపాల్సిందే
- బిల్లుల క్లెయిమ్‌లోనూ 'పైసా'చికత్వం
- ముట్టజెప్పకుంటే ముప్పుతిప్పలే
- తీవ్ర ఇబ్బందుల్లో పంచాయతీ సెక్రెటరీలు
- సొంతవారినే వేధిస్తున్న పరిపాలన ఉద్యోగి

**డీపీవోలో తిష్ట వేసిన ఆ నలుగురు**



# అవినీతి జలగలు

**నిజామాబాద్** జిల్లా పంచాయతీ కార్యాలయంలో అవినీతి పర్వానికి అడ్డే లేకుండా పోయింది. ఏ పని కావాలన్నా చేయి తడపాల్సిందే. చివరకు సెలవులైనా, హెల్త్ ఇన్సూరెన్స్ బిల్లులైనా అడిగినంతా ఇవ్వాల్సిందే. లేకపోతే ఫైలు ముందుకు కదలదు. డీపీవోలో ఏళ్లుగా పాతుకుపోయిన ఆ నలుగురు రాజ్యమేలుతున్నారు. సొంత ఉద్యోగులపైనే వేధింపులకు పాల్పడుతూ దండుకుంటున్నారని పంచాయతీరాజ్ శాఖ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు చాంబర్‌కు కూతవేటు దూరంలో ఉండే డీపీవోలో బరితెగిస్తున్న ఆ అక్రమార్కుల వ్యవహారం చర్చనీయాంశమైంది. నిత్యం జిల్లా స్థాయి అధికారుల రాకపోకలు కొనసాగించే గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఉన్న డీపీవోలో గుట్టుగా వసూళ్ల పర్వం నడుస్తున్నది. కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు తెలుస్తే ప్రమాదమన్న భయం కూడా లేకుండా విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లాకు సుదీర్ఘ కాలం తర్వాత ఇన్‌చార్జి డీపీవో కొనసాగుతున్నారు. ప్రస్తుతం శాశ్వత అధికారి లేకపోవడంతో అక్రమార్కులకు ఆడిందే ఆట అన్నట్లుగా మారిందని సిబ్బంది వాపోతున్నారు.

–నిజామాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**పంచాయతీ** సెక్రెటరీలపై ఇప్పటికే తీవ్ర పని ఒత్తిడి ఉంది. పదుల సంఖ్యలో ఉండే విధుల్లో తలామునకలయ్యే వారికి సొంత శాఖ ఉద్యోగుల నుంచి వస్తున్న ఒత్తిడితో సతమతమవుతున్నారు. డీపీవోలో పని చేసే ఆ నలుగురి వేధింపులను భరించలేక పోతున్నారు. మహిళలు, పురుషులు అన్న తేడా లేకుండా ఆ నలుగురి కారణంగా నలిగి పోతున్నారు. సెలవు పెట్టినా, జబ్బు వచ్చి విశ్రాంతి తీసుకున్నా డబ్బులు అప్పగించనిదే బిల్లులు మంజూరు చేయరు. పైసా ఇవ్వనిదే సెలవులకు ఓకే అనరు. అడిగినంత ఇస్తేనే సరి. లేకుంటే ఆ నలుగురిలో ఎవరో ఒకరు ఫోన్ చేస్తారు. అకస్మాత్తుగా జిల్లా కేంద్రానికి పిలిపిస్తారు. భయపెడతారు. డబ్బులిచ్చి వెళ్లాలని ఆదేశిస్తారు. ఇవ్వకుంటే మెమోలు, చార్జ్ మెమోలు జారీ చేస్తామని భయపెడతారు. వారు అడిగినంత ఇచ్చుకోలేక గతంలో ఓ మహిళా సెక్రెటరీ ఎదురు తిరిగింది. తనకు ఆరోగ్యం బాలేక సెలవులు తీసుకుంది. డబ్బులు అడిగితే ఇవ్వలేదని సెలవులు మంజూరు చేయలేదు. అంతే ఏదో వంకతో తనిఖీలకు ఉసిగొల్పి మెమోలు జారీ చేశారు. సహేతుకమైన వివరణ ఇచ్చినప్పటికీ ఒప్పుకోక వేధించారు. చేసేది లేక సదరు మహిళా ఉద్యోగి.. పరిపాలన సంబంధిత వ్యక్తికి అడిగినంత డబ్బును 'కృష్ణా'ర్పణం చేశారు.

### వసూళ్ల దందా ఇలా..

మొన్నీమధ్యే ఓ మహిళా ఉద్యోగి తన తల్లిదండ్రులకు సంబంధించిన మెడికల్ బిల్లులను డీపీవోలో సబ్మిట్ చేసింది. కానీ డీపీవో పరిపాలనలో కీలకంగా వ్యవహరించే ఓ వ్యక్తి కొర్రీలు పెట్టారు. వైవాహిక జీవితానికి దూరంగా ఉంటున్న సదరు మహిళా ఉద్యోగికి అత్తామామలతో సంబంధం లేదు. ఫలితంగా తల్లిదండ్రులకు హెల్త్ బెనిఫిట్స్ కోసం అప్లై చేస్తే బిల్లులు మంజూరు చేయకుండా వేధిస్తున్నాడు. చెప్పులరిగేలా తిరుగుతున్నప్పటికీ పని చేయడం లేదు. చేసేది లేక ఓ ప్రజాప్రతినిధికి మొర పెట్టుకోగా, సమస్య పరిష్కారం కాకపోగా మరింత జఠిలమైంది. నాపైనే ఫిర్యాదు చేస్తావా? నీ సంగతి చూస్తానంటూ సదరు ఉద్యోగి మరింత రెచ్చిపోయి ఆమెపై ప్రతాపం చూపిస్తున్నాడు. మానవత్వం లేకుండా సొంత శాఖ ఉద్యోగినికి సంబంధించిన హెల్త్ బిల్లుల మంజూరులో జాప్యం చేస్తూ పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తున్న ఈ అక్రమార్కులపై పంచాయతీరాజ్ శాఖలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. లోకల్ బాడీ అదనపు కలెక్టర్ వద్ద సీసీగా పని చేసిన ఓ వ్యక్తి ఈ అక్రమార్కులకు అండగా ఉండే వాడని, అదనపు కలెక్టర్‌కు తప్పుడు సమాచారమిచ్చి డీపీవోలోని ఆ నలుగురి ఆగడాలను మద్దతుగా నిలిచ్చినట్లు చర్చ జరుగుతున్నది. సీసీ పేరు చెప్పి మరింతగా రెచ్చిపోయిన వీరంతా జూనియర్ పంచాయతీ సెక్రెటరీల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారని తెలిసింది. మొన్నటి వరకు డీపీవోగా పనిచేసిన తరుణ్ ఈ మధ్యే సెంట్రల్ సర్వీసులకు వెళ్లారు. డీపీవో బదిలీని బూచీగా చూపి చాలా మంది పంచాయతీ సెక్రెటరీలను భయపెట్టి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూళ్లకు పాల్పడ్డట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ అక్రమార్కులకు మండల స్థాయి పంచాయతీ అధికారులు వత్తాసు పలుకుతున్నారని తెలిసింది. తమకు ఇబ్బంది రావొద్దనే ఉద్దేశంతో అడిగినంత ఇచ్చుకోవాలని తమను ఉసిగొల్పుతున్నారని సెక్రెటరీలు వాపోతున్నారు. డీపీవోలో రాజ్యమేలుతోన్న ఈ అక్రమార్కులపై నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

# రుద్రూర్‌లో ధాన్యం కాంటాలు ప్రారంభం

రుద్రూర్, నవంబర్ 4 : మండలకేంద్రంలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియను అధికారులు సోమవారం ప్రారంభించారు. గత నెల 15వ తేదీన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా ఆదివారం వరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టలేదు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని కేంద్రం వద్ద వేసిన టెంటు కింద రైతులు కూర్చొని నిరసన తెలిపారు. దీనిపై 'నమస్తే తెలంగాణ' పత్రికలో 'ప్రారంభించారు.. పత్తాలేకుండా పోయారు' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత అధికారులు.. కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణను ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.


రుద్రూర్‌లో ధాన్యం సేకరిస్తున్న అధికారులు

## కొనుగోలు కేంద్రంలో రైతుల ఆందోళన


అంతంపల్లిలో సీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

భిక్కనూరు, నవంబర్ 4: కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంటాలో, తేమ శాతం కొలిచే యంత్రంలో తేడాలు ఉన్నాయని భిక్కనూరు మండలం అంతంపల్లి సింగిల్ విండో ఆవరణలో రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. తేమ శాతం తక్కువగా ఉన్నప్పటికీ, ఎక్కువగా ఉన్నట్లు చూపిస్తున్నదని సీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఏడీఏ అపర్ణ, ఏవో రాధారెడ్డి వచ్చి రైతులతో మాట్లాడారు. తేమ శాతాన్ని కొలిచే మరో యంత్రాన్ని తెప్పించారు. అలాగే, తూనికలు, కొలతల శాఖ అధికారులతో మంగళవారం రైతుల సమక్షంలోనే కాంటాలను సర్టిఫైడ్ చేయిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

## జీపీ కార్యాలయాలకు తాళం



వర్ని (రుద్రూర్), నవంబర్ 4: ప్రజల సౌకర్యార్థం రోజంతా తెరిచి ఉండాల్సిన జీపీ కార్యాలయాలు తాళాలతో దర్శనమిచ్చాయి. వర్ని మండలంలోని శంకోరా, వకీల్ ఫారం గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు సోమవారం మధ్యాహ్నం నుంచే తాళాలు వేసి ఉన్నాయి. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యదర్శులు, కారోబార్లు అందుబాటులో లేకపోవడంతో పనిపడితే ఎవరిని అడగాలని గ్రామస్తులు ప్రశిస్తున్నారు.

## కాంట్రాక్టర్లపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేదు

**అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

ఖలీల్‌వాడి, నవంబర్ 4 : రాష్ట్రప్రభుత్వానికి కమీషన్లు, కాంట్రాక్టర్లపై ఉన్న శ్రద్ధ పాఠశాలల్లోని విద్యార్థులపై లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. ఇంటర్నేషనల్ విద్యావిధానం అందిస్తామన్న రేవంత్ సర్కార్.. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందన్నారు. కోటగల్లీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు శిథిలావస్థకు చేరడం, 700 మంది విద్యార్థులకు ఆరు టాయిలెట్లు మాత్రమే అందుబాటులో ఉండడం, కిటికీలు సరిగ్గా లేకపోవడాన్ని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ వైర్లు వేలాడుతూ కనిపించడంతో ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. టీచర్లు ఇష్టారాజ్యంగా సెలవులు తీసుకోవడం, పిల్లల హాజరును రెండు రోజుల నుంచి తీసుకోకపోవడంపై మండిపడ్డారు. విద్యార్థులతో కలిసి భోజనంచేసి, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.